
తిలక్‌నగర్ మెయిన్ రోడ్డుపై కూలిన భారీ వృక్షం

## రోడ్డుపై కూలిన భారీ వృక్షం

● తప్పిన పెనుప్రమాదం

**బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** గాలి దుమారం లేకున్నా ఓ భారీ వృక్షం కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలోని తిలక్‌నగర్ మెయిన్ రోడ్డుపై జరిగింది. కిషన్‌రావు ఆస్పత్రి ఎదురుగా భారీ వృక్షం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం 2.15 నిముషాలకు ఒక్కసారిగా ఆ భారీ వృక్షం కుప్పకూలింది. చెట్ల కొమ్మలు రోడ్డుపై పడిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరు లేరు. దీంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సీగల్ కేఫ్ చౌరస్తా వద్ద తిలక్‌నగర్‌కు వెళ్లే రోడ్డును మూసివేసి వాహనాలను శివం రోడ్డుకు మళ్లించారు. ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద తిలక్‌నగర్‌కు వెళ్లే రోడ్డును మూసివేసి ట్రాఫిక్‌ను విద్యానగర్ వైపు మళ్లించారు. డీఆర్ఎఫ్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. చెట్ల కొమ్మలను తొలగించారు. దాదాపు మూడు గంటల పాటు ఈ రోడ్డులో ట్రాఫిక్‌ను నిలిపివేశారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి చెట్ల కొమ్మలు, చెట్టు మొద్దులను తొలగించారు. విద్యుత్ ఏఈ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ వీరమల్లు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చెట్ల కొమ్మలను పూర్తిగా తొలగించిన తర్వాత ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

## నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● ఎంపీ ఆర్.కృష్ణయ్య

**రాంనగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, గ్రూప్-1, 2, 3, 4 పోస్టులను పెంచాలని, టీచర్ పోస్టులను 25 వేలకు పెంచాలని కోరుతూ బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల. రామకృష్ణల ఆధ్వర్యంలో శుక్రవారం ఓయూ గేట్ నుంచి విద్యానగర్ చౌరస్తా వరకు నిరుద్యోగులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గ్రూప్-1 సర్వీస్ పోస్టులను 500 నుంచి 1600 కు పెంచాలని, గ్రూప్-2 పోస్టులు 783 నుంచి 2200కు పెంచాలని, గ్రూప్-3 పోస్టులు 1383 నుంచి 3 వేలకు పెంచాలని, గ్రూప్-4 పోస్టులు 8,500 పెంచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చి ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎంపీ ఎన్నికల్లో నిరుద్యోగులు, బీసీల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు సి.రాజేందర్, రేవంత్, భాస్కర్, నిరుద్యోగులు పాల్గొన్నారు.


రమణ వెలమకన్నికి పురస్కారం బహూకరిస్తున్న మధుసూదనాచారి

## సాహిత్య విమర్శకు ప్రాధాన్యమిస్తే ఉత్తమ రచనలు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):** తెలుగులో సాహిత్య విమర్శకు ప్రాధాన్యమిస్తే మరిన్ని ఉత్తమ రచనలు రావడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం గానసభ మాజీ అధ్యక్షుడు డా.కళా దీక్షితులు జయంతి సందర్భంగా ఆయన పేరిట ఏర్పాటు చేసిన పురస్కారాన్ని సాహితీవేత్త, విమర్శకుడు రమణ వెలమకన్నికి మధుసూదనాచారి బహూకరించి మాట్లాడారు. దీక్షితులు తండ్రి కళా సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటైన గానసభ ప్రతిష్ఠను కొనసాగించడం లో విశేష కృషి చేశారన్నారు. సుదీర్ఘకాలం అధ్యక్షుడుగా కళా దీక్షితులు ఇంటి పేరుకు తగ్గట్టుగానే కళాసేవ చేశారన్నారు. ఎందరో ఔత్సాహిక కళాకారులకు వేదిక ఇచ్చారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ తన సోదరుడు దీక్షితులు చూపిన మార్గంలో గానసభ గౌరవం కాపాడుతున్నామని తెలిపారు. రమణ వెలమకన్ని సాహిత్య ప్రసంగాలు మంచి సమాచారంతో పరిశోధనాత్మకంగా ఉంటాయన్నారు. కథక్ నాట్యాచారుడు పండిట్ అంజిబాబు, శంకర్‌ప్రసాద్ పాల్గొని దీక్షితులుతో తమ అనుబంధాన్ని గుర్తుచేశారు.


బాపునగర్‌లో కలుషితనీటి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్

## కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కారానికి చర్యలు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** మంచినీటి సరఫరాలో కలుషితనీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ తెలిపారు. చిక్కడపల్లిలోని స్ట్రీట్ నెంబర్ 1, 2, బాపునగర్ తదితర పరిసర ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా సమస్యను స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జలమండలి మేనేజర్ కృష్ణమోహన్‌తో ఫోన్‌లో సంప్రదింపులు జరిపారు. తక్షణమే జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది బాపునగర్‌కు చేరుకున్నారు. కార్పొరేటర్ ఆదేశాలమేరకు సమస్యను పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సమస్య పునరావృత్తం కాకుండా మూడురోజుల్లో సమస్యను పరిష్కరిస్తారని ఈ సందర్భంగా ఆమె స్థానికులకు హామీ నిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా ఉన్న తాగునీటి సరఫరా లోప్రెషర్ సమస్యను కూడా పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, కాలనీవాసులు శ్రీకాంత్, లక్ష్మణ్‌గౌడ్, రంగనాథ్, వసంత్, సర్దేశ్‌ముఖ్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: ఏఐవైఎఫ్

**బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** ఇంటర్ బోర్డు అనుమతి లేకుండా రాష్ట్రవ్యాప్తంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలను గుర్తించి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని క్ష కాలేజీ యాజమాన్యం అక్రమంగా అడ్మిషన్లు తీసుకోవడాన్ని నిరసిస్తూ కళాశాల గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు అధికారికంగా అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేయకముందే కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు అక్రమంగా అడ్మిషన్లు తీసుకోవడం, తరగతులు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శ్రీకాంత్, పి.సత్యప్రసాద్, శ్రీమాన్, ఆర్. బాలకృష్ణ, షేక్ మహమూద్, మురళి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీదే విజయం: దానం

● బీఆర్ఎస్‌కు మెజార్టీ దక్కదు
● పోటీ కాంగ్రెస్-బీజేపీల మధ్యనే


మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న దానం నాగేందర్

**గోల్నాక, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కదని... ప్రధాన పోటీ కాంగ్రెస్ పార్టీ .. బీజేపీ మధ్యనే ఉంటుందని.. విజయం కాంగ్రెస్ పార్టీదేనని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందాలని దేవుడు శ్రీరామున్ని ఓట్ల కోసం వాడుకోవడం బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి తగదని ఆయన అన్నారు. గురువారం అంబర్‌పేట చే నంబర్‌లోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు, అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దానం నాగేందర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు డిపాజిట్ దక్కని, సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీకి మతతత్వ పార్టీ బీజేపీకి మధ్య పోటీ జరుగుతుందని అందులో విజయం కాంగ్రెస్‌దేనని అన్నారు. కిషన్‌రెడ్డికి అవకాశం ఇస్తే కేంద్రమంత్రి అయ్యారు. ఈ ఐదేళ్లలో ఆయన సికింద్రాబాద్‌కు ఒరగబెట్టిందేమి లేదన్నారు. తాను కరుడుగట్టిన కాంగ్రెస్ వాదినని కొన్ని పరిస్థితులలో పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరడం జరిగిందన్నారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ ప్రజల ఆదరణను చూరగొంటుందని, ఈ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 ఎం.పీ స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా 10 సంవత్సరాలు కొనసాగడం ఖాయమని ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు.

పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికలు ఆషామాషీ ఎన్నికలు కావని ప్రజలు జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేసి దేశ భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. సమావేశంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు జ్ఞానేశ్వర్‌గౌడ్, నారాయణస్వామి, రాంబాబు, శ్రీదేవి, కాంగ్రెస్ నాయకులు యాదగిరిగౌడ్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకాంత్, తదితరులు

## 42 అంతస్తుల భవన నిర్మాణాన్ని నిలిపివేయాలి

● అవినీతి నిర్మూలన ధర్మ యుద్ధ సంఘం

**బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** గన్‌ఫౌండ్రీ డివిజన్ ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా జనవాసాల నడుమ 42 అంతస్తుల భవనాల నిర్మాణాలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని అవినీతి నిర్మూలన ధర్మ యుద్ధ సంఘం డిమాండ్ చేసింది. ఇప్పటికే 21 అంతస్తుల నిర్మాణ పనులు పూర్తయ్యాయని మరో 21 అంతస్తుల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఈ భారీ భవన నిర్మాణం వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వారన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.శివకాంత్, ప్రధాన కార్యదర్శి ఎం.పురుషోత్తమ్, ఉపాధ్యక్షుడు జి.విజయ్‌కాంత్, సంయుక్త కార్యదర్శి ఎం.రాజేష్, మీడియా కార్యదర్శి ఎం.ఎల్. మల్లికార్జున్‌రావులు మాట్లాడారు. 4 వేల గజాల విస్తీర్ణంలో ఈ భారీ భవనాన్ని నిర్మిస్తున్నారని ఇది వ్యాపార సముదాయం కాదని వారు స్పష్టం చేశారు. ఈ భారీ భవన నిర్మాణం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే తమ పరిస్థితి ఏమిటని చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు ఆందోళన చెందుతున్నారని వారన్నారు. ఆబిడ్స్‌లోని పుల్లారెడ్డి స్వీట్‌హౌస్ పక్కన 2 వేల గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకున్నా భవన నిర్మాణం కోసం తవ్వకాలు జరుపుతున్నారని వీటిపై కూడా జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


శివపార్వతిని సన్మానిస్తున్న చిల్ల రాజశేఖరరెడ్డి, వెంకటరెడ్డి

## సందడిగా సినీ సంగీత విభావరి

**చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** ప్రముఖ సాంస్కృతిక సంస్థ శ్యామ గాయత్రి ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో శుక్రవారం రాత్రి నూతన గాయనీగాయకులతో పాటు వర్ధమాన గాయకులు కలిసి నాటి నేటి సినీ పాటల ఆలాపనతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త చిల్ల రాజశేఖరరెడ్డి పాల్గొని మాట్లాడుతూ శ్యామగాయత్రి సంస్థ నిర్వాహకురాలు శివపార్వతి శాస్త్రీయ సంగీత గురువు అని వైవిధ్యం కోసం సినీ పాటల విభావరి ఏర్పాటు చేశారని పేర్కొంటూ ఆమెను సత్కరించారు. అధ్యక్షత వహించిన కళాపోషకుడు గుదిబండి వెంకటరెడ్డి మాట్లాడుతూ శివపార్వతి సంగీత సేవను ప్రశంసించారు. ప్రముఖ గాయకుడు త్రినాథరావు, నాదయోగ కల్చరల్ ఆర్గనైజేషన్ స్థాపకుడు గణపతి పాల్గొనగా సంస్థ కార్యదర్శి చేపూరి లక్ష్మి నివేదిక సమర్పించగా అధ్యక్షురాలు శివపార్వతి స్వాగతం పలికారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న దళిత సంఘాల నేతలు

## వరంగల్ ఎంపీ, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ మాదిగలకు కేటాయించాలి

● మాదిగ సంఘాల నేతల డిమాండ్

**రాంనగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగలపై ఏ మాత్రం గౌరవం, చిత్తశుద్ధి ఉంటే త్వరలో జరిగే ఎన్నికల్లో వరంగల్ ఎంపీ, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాలను మాదిగలకు కేటాయించాలని మాదిగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో తెలంగాణ సామాజిక తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు పోకల. కిరణ్‌కుమార్ మాదిగ అధ్యక్షతన రాష్ట్రంలోని మాదిగ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ మాదిగలకు అన్ని రంగాలలో తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ నమ్మించి గొంతు కోసిందని ఆరోపించారు. మందకృష్ణ మాదిగ, వంగపల్లి. శ్రీనివాస్‌లు జాతిని అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందుతున్నారు తప్ప జాతికి ఏమి మేలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో మాదిగల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఎంపీ సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరంగల్‌లో మాదిగలకు ఇస్తే అన్ని మాదిగ సంఘాలన్నీ గెలిపిస్తాయని అన్నారు. అలాగే కంటోన్మెంట్ మాదిగలకు ఇస్తే గెలిపించుకుంటామన్నారు. ఈ నెల 15వ తేదీలోపు ఈ రెండు అంశాలపై సీఎం ప్రకటించాలని, లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని పోకల. కిరణ్‌కుమార్ మాదిగ హెచ్చరించారు.

## భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ

**బర్కత్ పుర ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** ఇంటిని భర్త పట్టించుకోకపోవడంతో గొడవపడి తన ఇద్దరు పిల్లలను వదిలేసి భార్య వెళ్లిపోయిన సంఘటన కాచిగూడ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ కుమార్ వివరాల ప్రకారం.. సంజీవయ్య నగర్‌లో నివాసముంటున్న శంకర్‌తో 2017లో భూమా రేణుక(26)కు వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం. భర్త ఇంటిని సరిగ్గా పట్టించుకోకపోవడంతో భార్యాభర్తల నడుమ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన భూమా రేణుక ఎవరికీ చెప్పకుండా సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లలో వెతికిన రేణుక ఆచూకీ లభించలేదు. దీంతో రేణుక తల్లి తిరుపమ్మ శుక్రవారం రాత్రి కాచిగూడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఎలైట్ స్పైన్ అండ్ పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రకాష్

## దిల్‌సుఖ్‌నగర్‌లో ఎలైట్ స్పైన్ అండ్ పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్

**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** ఎలైట్ స్పైన్ అండ్ పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్ తన రెండో బ్రాంచ్‌ను నిర్వాహకులు దిల్‌సుఖ్‌నగర్‌లో గురువారం ప్రారంభించారు. తక్కువ వ్యయంతో, అందరికి అందుబాటులో ఉండే విధంగా అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తామని సీనియర్ ఇంటర్నేషనల్ పెయిన్ ఫిజిషియన్ డాక్టర్ ప్రకాష్ గుడిపూడి తెలిపారు. నగరంలోని తూర్పు ప్రాంతాలైన మలక్‌పేట, అంబర్‌పేట, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్ ప్రజలతో పాటు నల్గొండ, ఖమ్మం ప్రాంతాలకు ఈ సెంటర్ చేరువగా ఉంటుందన్నారు. మణికొండలో ఏర్పాటు చేసిన తమ సెంటర్‌లో ఇప్పటి వరకు 25వేల చికిత్సలు చేయడం అరుదైన రికార్డుగా ఆయన చెప్పారు. దీర్ఘకాలిక నొప్పుల కోసం ప్లాస్మా రీజనరేటివ్ థెరపీ వంటి ఆధునిక పద్ధతులను అందిస్తున్నామని దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్ డైరెక్టర్ అండ్ క్లినికల్ హెడ్ డాక్టర్ మోహన్ తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న మైథిలి

## వీధి బాలల సంరక్షణకు కలిసి పనిచేయాలి

● డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువెనైల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ మైథిలి

**రాంనగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** వీధి బాలల సంరక్షణకు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువెనైల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ మైథిలి సూచించారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా రెయిన్‌బో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మైథిలి మాట్లాడుతూ వీధి బాలల సంరక్షణలో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వీధి బాలల సంరక్షణ కోసం సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించడం ద్వారా వీధి బాలల హక్కులు అమలులోకి వస్తాయన్నారు. ఈ సదస్సులో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శైలజ, డిప్యూటీ కమిషనర్ లేబర్ రాజేంద్రప్రసాద్, సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నూరెపల్లి రవికుమార్

## బహుజనుల్లో రాజకీయ చైతన్యం రావాలి

● నూరెపల్లి రవికుమార్

**రాంనగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** బహుజనులకు రాజ్యాధికారం దక్కినపుడే మహనీయులకు నిజమైన నివాళి అని అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి నూరెపల్లి రవికుమార్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బహుజనుల రాజ్యాధికారం-కుల సంఘాల పాత్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల్లో రాజకీయ చైతన్యం రావాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు. కుల సంఘాలు ఓటుకు అమ్ముడు పోవడం వల్ల అగ్రకులాల వారు రాజ్యాధికారాన్ని కైవసం చేసుకుంటున్నారని వాపోయారు. కుల సంఘాల్లో సామాజిక స్పృహ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఐక్యమైనపుడే రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ప్రముఖ అంబేడ్కరిస్టు జేబీ రాజు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్. వై.కె.రత్నం, విద్యావేత్త వడ్డేపల్లి కృష్ణ, డాక్టర్ చిక్కా. దేవదాస్, కొప్పుల దేవేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


నిరుపేదలకు చీరలను పంపిణీ చేస్తున్న వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ సుజాత

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత

**బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాధికారిత సాధ్యమవుతుందని రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత అన్నారు. వీబీజీ ఫౌండేషన్ వనిత విభాగం ఫౌండర్ సత్యవతిప్రసన్న ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలో మహిళలకు చీరలు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనాథ ఆశ్రమాలలో నిత్యావసరాలు, వృద్ధాశ్రమాలలో వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఏదో ఒక రంగంలో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థిక పురోగతి సాధించాలన్నారు.

## రేపు ఉచిత వైద్య శిబిరం

**బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** జీవీఆర్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో ఈ నెల 14 ఆదివారి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అకాడమి డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాచిగూడలోని అకాడమి ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, దంత వైద్య నిపుణులు డాక్టర్ అమిద్ జిలానీ, మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణారెడ్డి వైద్య శిబిరంలో పాల్గొంటారని తెలిపారు.

## 17న సీతారాముల కల్యాణం

**బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 17న సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్. వెంకట్రావ్ తెలిపారు. కాచిగూడలోని మ్యాడం అంజయ్య హల్‌లో బుధవారం సాయంత్రం 6 గంటలకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్ బోర్డు సీనియర్ ట్రస్టీ పన్నాల విష్ణువర్ధన్ అధ్యక్షతన నిర్వహణ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## బాలికను పెళ్లి చేసుకున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు

**బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** బాలికను ప్రేమించి పెళ్లి చేసుకున్న యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు కాచిగూడ ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు. హబీబ్‌నగర్‌కు చెందిన బాలాజీ (22) కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఓ బాలికను ప్రేమించి ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. దీనిపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో బాలాజీపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## కనులపండువగా మంటపారాధన

**చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం కనులపండువగా మంటపారాధన నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవాచనము, దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ, ప్రదోషకాల పూజ కార్యక్రమాలు జరిగాయి. వార్షికోత్సవంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో దేవనాథం, సిబ్బంది ఆచారి, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


గుడిలో శైలజను సన్మానిస్తున్న దృశ్యం

## ఘంటసాల స్వరరాగ మహాయాగం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ హైదరాబాద్ వారు నిర్మించిన ఘంటసాల గుడి 9 సంవత్సరాలు అయిన సందర్భంగా శుక్రవారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త వంశీ రామరాజు మాట్లాడుతూ పుష్పగిరి స్వాములవారు ప్రతిష్ఠ చేసిన విగ్రహం అని, ఈ ఏడాది డిసెంబర్ 4 నుంచి 100 రోజులు ఘంటసాల గుడిలో ఘంటసాల స్వరరాగ మహాయాగం నిర్వహిస్తామని తెలిపారు. గుడి నిర్మించిన విజయనగరం వాస్తవ్యురాలు వంశీ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకరపల్లి మాట్లాడుతూ ఘంటసాల గుడి నిర్మించే అవకాశం తమకు లభించడం తమ పూర్వజన్మ సుకృతం అన్నారు. సుజా రమణ, ఘంటసల వెంకటేశ్వరరావు, రమణారావు, ప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


చలివేంద్రం వద్ద మంచినీటిని తాగుతున్న పాదచారులు

## ముషీరాబాద్‌లో చలివేంద్రం ఏర్పాటు

**ముషీరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** భోలక్‌పూర్‌కు చెందిన చిరువ్యాపారులు ఏకతాటిపైకి వచ్చి హంసబ్ ఏక్ హై వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేసి 17 సంవత్సరాలుగా ప్రతి వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నారు. ముషీరాబాద్ ప్రధాన రోడ్డులో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల పక్కన సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు మంచినీటిని అందిస్తున్నారు. వారు చేస్తున్న సేవలను అభినందిస్తూ ముషీరాబాద్‌లోని జలమండలి అధికారులు మంచినీటిని ట్యాంకర్ల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణపై ప్రభుత్వం స్పందించాలి : యూటీఎఫ్

**కవాడిగూడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):** ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 సంవత్సరాలు 33 సంవత్సరాల సర్వీసు పూర్తయితే పదవీ విరమణ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లుగా వస్తున్న వార్తలపై స్పష్టత ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావ. రవి డిమాండ్ చేశారు. శుక్రవారం దోమలగూడలోని యూటీఎఫ్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ అంశంపై ప్రభుత్వం విధి విధానాలు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.



చిక్కడపల్లిలోని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయంలో మోడల్ ఎంసెట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు



## పూడిక మట్టిని వెంటనే తరలించాలి

రాంనగర్ వరద నీటి కాలువలో తీసిన పూడిక మట్టిని రాంనగర్ బ్రిడ్జి పక్కన రోడ్డుపై వేశారు. దుర్వాసన రావడం తోపాటు పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు పూడిక మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

\- రాంనగర్, ఆంధ్రజ్యోతి